# సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 28 । మార్చి । 2023






## హుండీ ఆదాయం రూ.35లక్షలు

ఓదెల: మల్లన్న స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.35,49,062 వచ్చినట్లు ఈవో సదయ్య తెలిపారు. మిశ్రమ బంగారం, వెండి వచ్చిందన్నారు.



## 'పది' పరీక్షలకు ఏర్పాట్లు..!

పదో తరగతి పరీక్షలు వచ్చేనెల 3 నుంచి ప్రారంభంకానున్నాయి. గతంలో మాదిరిగాకాకుండా ఈసారి ఆరు పేపర్లకే పరీక్షలు ఉంటాయి.

8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/23.0

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం విపరీతమైన ఉక్కపోత పెరుగుతుంది.

కూలీలతో పని చేయించుకున్నప్పుడు వారి చెమట ఆరకముందే కష్టార్జితం చెల్లించాలి
– మహమ్మద్ ప్రవక్త

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| మంగళ: 6:32 | బుధ 4:48 |

### రంజాన్ వేళలు

## న్యూస్‌రీల్

### ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరండి



కరపత్రాలు అందిస్తున్న అధ్యాపకులు, సీనియర్ విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అన్ని వసతులు ఉన్నాయని, అందులో చేరాలని కళాశాల అధ్యాపక బృందం, సీనియర్ విద్యార్థులు ఇంటర్ కాలేజీల్లో కరపత్రాలతో ప్రచారం చేస్తూ విద్యార్థులను ఆహ్వానిస్తున్నారు. జిల్లాకేంద్రంతోపాటు ఓదెల, శ్రీరాంపూర్, సుల్తానాబాద్‌లోని జూనియర్ కాలేజీలకు వెళ్లి కరపత్రాలను అందించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అందుబాటులో ఉందని, డిజిటల్ లైబ్రరీ, స్మార్ట్‌క్లాస్‌రూం, అధునాతన కంప్యూటర్ ల్యాబ్, విశాలమైన క్రీడామైదానం ఉందని పేర్కొన్నారు. అధునాతనమైన జిమ్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుదీర్ఘ అనుభవం ఉన్న అధ్యాపకులతో బోధన సాగుతోందని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య కోరారు. కాలేజీ అధ్యాపకులు శ్రీనివాస్, సంజీవ్, రవీందర్‌రావు, మనోజ్, రామకృష్ణ, అర్జున్, తిరుపతి, అంజయ్య, కిరణ్మయి, సునిత, రజిత తదితరులున్నారు.

### ఏప్రిల్ 1నుంచి దివ్యాంగులకు ఉపకరణాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని శారీరక దివ్యాంగులకు ఉపకరణాలను నియోజకవర్గ కేంద్రాల వారీగా పంపిణీ చేసేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అలిమ్‌కో వారు పరికరాలు అందిస్తున్నట్లు వివరించారు. ఏప్రిల్ 1న జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కమిటీ యార్డు ఆవరణలో.. ఏప్రిల్ 3న గోదావరిఖని జీఎం ఆఫీస్‌రోడ్డులోని సింగరేణి ఫంక్షన్‌హాల్‌లో.. ఏప్రిల్ 4న మంథని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు 80శాతం పైగా ఉన్న సదరం సర్టిఫికెట్, నెలకు రూ.10వేల లోపు గల ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు వెంట తెచ్చుకోవాలని కోరారు. వివరాలకు 94408 52495, 99856 99702లో సంప్రదించాలని సూచించారు.

### ఇంటర్ పరీక్షకు 5,674 మంది హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ ద్వితీయ పరీక్షకు 5,674 మంది విద్యార్థు లు హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. మొత్తం 5,858 మంది విద్యార్థులకు 184 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

### పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి

పెద్దపల్లిరూరల్: విద్యార్థులు, యువత పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని డీఈవో మాధవి అన్నారు. జిల్లాకేంద్రంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన లైబ్రరీ రీడింగ్ కార్నర్ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. విద్యార్థులకు రాయడం, చదవడంలో ఆసక్తి కలిగించాలన్నారు. గ్రంథాలయాల్లో కథల పుస్తకాలను అందుబాటులో ఉంచడం ద్వారా అది సాధ్యమన్నారు. జిల్లాలో తొలివిడతగా 152 పాఠశాలల్లో నేషనల్ బుక్‌ట్రస్ట్, రూమ్‌టురీడ్ టెస్ట్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కో–ఆర్డినేటర్ షేక్, ఆర్పీలు ప్రవీణ్, తిరుపతి పాల్గొన్నారు.

### నేడు కాయకల్ప బృందం రాక

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని సీహెచ్‌సీ (వైద్య విధాన పరిషత్)ని మంగళవారం ఎన్‌హెచ్ఎం (నేషనల్ హెల్త్ మిషన్) టీం సభ్యులు సందర్శించనున్నారు. ఈ కాయకల్ప బృందం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్యం తీరును ప్రభుత్వానికి నివేదించనున్నారు. కాయకల్ప బృందం వస్తున్న సందర్భంగా ఆసుపత్రికి మెరుగులు దిద్దే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

# కొనుగోళ్లకు కసరత్తు..!

- ప్రణాళిక సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం
- 300 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- ఇబ్బందులు తొలగిస్తేనే సజావుగా ధాన్యం సేకరణ



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు (ఫైల్)

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో ఏటా రెండు పంటలు సాగవుతుండగా.. అందులో ఎక్కువగా వరి ఉంటోంది. వానాకాలంలో కురిసిన వర్షాలకు భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది. మరోవైపు ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీరు అందుతుండటంతో అంచనాలకు మించి పంటలు సాగయ్యాయి. ఈ యాసంగి సీజన్‌లో పండించిన ధాన్యం కొనుగోళ్లకు పౌర సరఫరాల శాఖ సన్నద్ధం అవుతోంది. సాగైన పంట విస్తీర్ణం, దిగుబడి అంచనాకు అనుగుణంగా ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనేందుకు ప్రణాళిక రూపొందించింది ప్రభుత్వం. జిల్లాలో 300 కొనుగోలు కేంద్రాల ద్వారా 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం (అంచనా ప్రకారం..) కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు కేంద్రాల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారు.

**అంచనాలకు మించి సాగు..**

జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా.. ఏప్రిల్‌లో లక్ష మెట్రిక్ టన్నులు, మే నెలలో 2.93 లక్షలు, జూన్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు ఇబ్బంది కలగకుండా జిల్లావ్యాప్తంగా 222 పీఏసీఎస్‌లు, 59 ఐకేపీ, 14 డీసీఎంఎస్, 5 ఏఎంసీ కేంద్రాలను వచ్చేనెల రెండోవారంలో ప్రారంభించనున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో వరి దిగుబడి తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**లోపాలు అధిగమిస్తేనే..**

కొనుగోలు కేంద్రాలు మొదలైన తర్వాత రైతుల కష్టాలు మొదలవుతాయి. కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకునే రైతులకు పూర్తిస్థాయిలో టార్పాలిన్లు సరఫరా చేయకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్రాల్లోని సిబ్బంది ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేయాల్సి ఉండగా వారు జాప్యం చేస్తున్నారు. ఫలితంగా రైతుల ఖాతాలో సకాలంలో నగదు జమ కావడం లేదు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించటంలో లారీల కొరత ఏర్పడుతోంది. దీంతో రవాణా ఆలస్యం అవుతుండటంతో అన్నదాతలు కేంద్రాల్లోనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ముఖ్యంగా కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు తేమపేరుతో తరుగు తీయటంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్రాల వద్ద ధాన్యం తూర్పార యంత్రాలు అందుబాటులో ఉంచి, తరుగు దోపిడీకి అడ్డుకట్టవేయాలని అన్నదాతలు కోరుతున్నారు. ఎండాకాలం కావటంతో కేంద్రాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేయడం, తాగునీటిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

### పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు



ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం కసరత్తు దాదాపు పూర్తి చేసింది. అవసరాల మేరకు కేంద్రాల సంఖ్యను నిర్ణయించాం. అన్ని రకాల ఏర్పాట్లు, సౌకర్యాల కల్పనపై ప్రణాళికలు రూపొందించాం. ధాన్యం వచ్చే నెల రెండోవారంలో కేంద్రాలకు వచ్చే అవకాశముంది. ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా కొనుగోళ్లను సవ్యంగా పూర్తి చేస్తాం.

– వెంకటేశ్, జిల్లాపౌరసరఫరాల శాఖ అధికారి

**ఈ ఏడాది ఇదీ లెక్క..**

| వరి సాగు | కొనుగోలు లక్ష్యం | కొనుగోలు కేంద్రాలు | ప్రస్తుతమున్న గన్నీ సంచులు | ఇంకా కావాల్సినవి | కావాల్సిన టార్పాలిన్లు | సిద్ధంగా ఉన్నవి |
|---|---|---|---|---|---|---|
| 2.62లక్షల ఎకరాలు | 4లక్షల మెట్రిక్ టన్నులు | 300 | 65లక్షలు | 40లక్షలు | 4239 | 2094 |

| ధాన్యం శుద్ధి యంత్రాల అవసరం | అందుబాటులో ఉన్నవి | తేమగుర్తింపు యంత్రాలు | ప్రస్తుతం ఉన్నవి | అవసరమైన తూకం యంత్రాలు | సిద్ధంగా ఉన్నవి |
|---|---|---|---|---|---|
| 67 | 8 | 360 | 266 | 658 | 540 |

### ప్రజావాణి సమస్యలకు సత్వర పరిష్కారం



పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చి.. ప్రజావాణిలో అందించిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ సంగీత సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 49 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ సంబంధమైనవే 35 ఉన్నాయి. వీటిని వెంటవెంటనే పరిష్కరించాలని సూచించారు. సొంత ఇల్లు లేని తనకు డబుల్‌బెడ్ రూం ఇల్లు కేటాయించాలని జిల్లాకేంద్రంలోని తెనుగువాడకు చెందిన నక్క పద్మ కలెక్టర్‌కు అర్జీ పెట్టుకుంది. అర్హత ఉండి.. జాబితాలో తన పేరు ఉన్నా లక్కీడ్రాలో మాత్రం పేరు రాలేదని వాపోయింది. తన తండ్రి రైస్‌మిల్లులో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణించగా 2007 ఏప్రిల్ 16న పరిహారంగా తన పేరిట రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారని, ఆ నిధులను తనకు ఇప్పించాలని దరఖాస్తు చేసుకుంటే ఫైలు దొరకడం లేదంటున్నారని సుల్తానాబాద్ మండలం పూసాలకు చెందిన శ్రీరాముల స్వరూప కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని సర్వే నంబర్లు 1111, 1114లో 4గుంటల భూమిని కొందరు కబ్జా చేశారని, విచారణ జరిపించి తమ భూమి తమకు ఇప్పించాలని అడిచెర్ల నారాయణ కూతుళ్లు కోరారు.

**బామ్లానాయక్‌తండా సర్పంచ్‌పై ఫిర్యాదు**

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండా సర్పంచ్ బదావత్ రాజునాయక్‌పై ఆ గ్రామ యువకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జీడీనగర్ పంచాయతీ పరిధి రజ్వీకాలనీని తమ గ్రామంలో విలీనం చేశారని, సర్పంచ్ రాజునాయక్ గ్రామసభ నిర్వహించకుండానే రజ్వీకాలనీని గెజిట్ నిబంధనలకు విరుద్ధంగా తన స్వలాభం కోసం కన్నాలలో విలీనం చేసేందుకు తీర్మానించారని పేర్కొన్నారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్న సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని బదావత్ శంకర్, అంజిబాబు, రాజేష్, దంలా, శ్రీను కోరారు.

## పట్టాలిప్పించిన ఘనత వైఎస్సార్‌దే..!



కార్మికులతో కలిసి అభివాదం చేస్తున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న కార్మికులకు పట్టాలిప్పించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డికే దక్కుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ తెలిపారు. సోమవారం జీడీకే–2వ గనిపై మాట్లాడారు. ఇంటి బిడ్డగా ఆశీర్వదించి ఒక్కసారి గెలిపించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రపన్నుతున్నాయని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీకి సింగరేణి కార్మిక కాలేజీగా నామకరణం చేయాలని, కార్మికుల పిల్లలకు 40శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. నాయకులు మహంకాళి స్వామి, ఎండీ.ముస్తఫా, పెద్దల్లి తేజస్విని, ప్రకాశ్, రవికుమార్, గట్ల రమేశ్, రవియాదవ్, యుగేందర్, తిప్పారపు శ్రీనివాస్, గడ్డం శేఖర్, దాసరి విజయ్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పోరాటాలతోనే రైతు చట్టాలు వెనక్కి**

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో మక్కాన్‌సింగ్ హాథ్‌సే హాథ్ జోడో చేపట్టారు. ప్రతిఒక్కరినీ కలుస్తూ మాట్లాడారు. కేంద్రం తెచ్చిన రైతు వ్యతిరేక నల్లచట్టాలను కాంగ్రెస్ పోరాటాలతోనే వెనక్కి తీసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని పేర్కొన్నారు. గాధం విజయానంద్, చుక్కల శ్రీనివాస్, బొమ్మక రాజేశ్, సింహాచలం, ఓర్సు అనిల్, దేవేందర్ రెడ్డి, కొటం సతీష్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో పలువురి చేరిక**

ముందుగా 38వ డివిజన్‌లో పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి మక్కాన్‌సింగ్ కండువాకప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌కు చెందిన దండు అనిల్ కుమార్, సాగి అభిరావు, పోడూరి సురేశ్ ఉన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని అన్నారు.

### హిందీ అందరూ నేర్చుకోవాలి



సోమ్లా బూక్యాకు అవార్డు అందిస్తున్న జీఎం ఠాకూర్

జ్యోతినగర్: అధికార భాష హిందీని అందరూ నేర్చుకోవాలని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు జనరల్ మేనేజర్ అలోక్ చంద్ర ఠాకూర్ అన్నారు. సోమవారం ప్రాజెక్టు పరిపాలనా భవనంలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన హిందీ అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎన్టీపీసీ రామగుండంలో ఉద్యోగులను అధికార భాష హిందీలో పనిచేసేలా ప్రేరేపించడం, హిందీ వాడకంలో ఉన్న ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు తమ విధి నిర్వహణలో వినియోగిస్తున్న కంప్యూటర్లలో గూగుల్ ఇండిక్ కీ–బోర్డ్ సదుపాయం ఉండాలని కూడా సూచించారు. హిందీ అమలులో ప్రత్యేక కృషి చేసిన సీనియర్ మేనేజర్ సోమ్లా బూక్యాకు అవార్డు అందించారు. అడిషనల్ మేనేజర్ బీఆర్‌పీ.రావు, సీనియర్ మేనేజర్ రాజ్‌భాషా ఆదేశ్ కుమార్ పాండేతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలను అరికడదాం



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

- వేసవిలో మరింత అప్రమత్తత అవసరం
- అవగాహన కోసం ప్రణాళిక సిద్ధం చేయండి
- విద్య,వైద్య, వ్యాపార సంస్థల్లో మాక్‌డ్రిల్
- కలెక్టర్ సంగీత వెల్లడి

పెద్దపల్లిరూరల్: ఎండాకాలంలో అగ్నిప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందని, విద్య, వైద్య, వ్యాపార సముదాయాల్లో అవగాహన కల్పిస్తే వాటిని అరికట్టవచ్చని కలెక్టర్ సంగీత అన్నారు. అగ్నిప్రమాదాల నియంత్రణకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్, అధికారులతో సమావేశమయ్యారు. అటవీప్రాంతాలు, గుట్ట ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే శాటిలైట్ ద్వారా సమాచారం అందించి నష్టం జరగకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, పాఠశాలల్లో ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలపై తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. వరి పొలాలకు నిప్పంటించడం ద్వారా కలిగే అనర్థాలపై రైతువేదికల్లో సమావేశాలను నిర్వహించాలన్నారు. ఉపాధిహామీ కూలీలు, పారిశుద్ధకార్మికుల పనివేళలను మార్పు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో డీసీపీ వైభవ్‌గైక్వాడ్, ఆర్డీఓలు వెంకటమాధవరావు, వీరబ్రహ్మచారి, జిల్లా అగ్నిమాపక అధికారి ఖాజా కరీముల్లా, పెద్దపల్లి ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్, డీఎఫ్ఓ శివయ్య, డీఆర్‌డీఓ శ్రీధర్, డీఈఓ మాధవి, డీఎంహెచ్ఓ ప్రమోద్‌కుమార్, డీఏఓ ఆదిరెడ్డి, డీపీఓ చంద్రమౌళి, మున్సిపల్ కమిషనర్లు సుమన్‌రావు, శ్రీనివాసరెడ్డి, శారద, ఇంటర్ నోడల్ అధికారి కల్పన తదితరులున్నారు.

# కొంచెం మోదం.. కొంచెం ఖేదం!

- ఎన్ఎంఆర్ వేతనాలు పెంచుతూ గెజిట్ జారీ
- రెండేళ్లకోసారి పెరుగుదల, తాజా సవరణతో 15శాతం పెంపు
- కరీంనగర్‌లో కనీస వేతనానికి దూరంగా కొందరు ఎన్ఎంఆర్‌లు
- రూ.425కు బదులుగా రోజుకు రూ.283 మాత్రమే చెల్లింపు
- సాక్షాత్తు కరీంనగర్ కలెక్టరేట్ ప్రాంగణంలోనే అమలుకాని వైనం
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సంతృప్తికరంగానే వేతనాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్)ల వేతనాలు పెంచుతూ కరీంనగర్ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి రెండేళ్లకోసారి వీరి వేతనాలను సవరిస్తూ ఉంటారు. కానీ, కరోనా కారణంగా 2020లో వీరికి వేతన సవరణ జరగలేదు. ఫలితంగా ఇప్పుడు 2020లతోపాటు 2022ను కలుపుకొని వేతనాలను 15శాతం పెంచుతూ గెజిట్ జారీ చేశారు. త్వరలోనే నూతన వేతనాలు అమలులోకి రానున్నాయి. అదే సమయంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌లకు ఇంకా 2016కు ముందు ప్రకారమే వేతనాలు చెల్లిస్తుండటం గమనార్హం. మొత్తానికి వేతనాలు పెరిగినందుకు కొందరు సంతోషపడుతుండగా.. మరికొందరు మాత్రం ఇంకా తమ బతుకులు మారనందుకు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కరీంనగర్ జిల్లాలో ఇలా?**

జిల్లాలో కలెక్టర్ కాంప్లెక్స్‌తోపాటు పలు ప్రభుత్వశాఖల్లో చిరుద్యోగులుగా పనిచేసే.. నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్)ల స్థితి దయనీయంగా ఉంది. నెల మొత్తం బండెడు చాకిరీ చేసినా వారికి దక్కేది కేవలం రూ.8500 మాత్రమే. అది కూడా 30రోజుల్లో ఒక్కరోజు కూడా ఆబ్సెంట్ లేకుండా ఉంటేనే. ఏ అవసరానికి సెలవుపెట్టినా వేతనంలో కోతలు తప్పవు. ఇలాంటి వారు దాదాపు కేవలం కరీంనగర్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో 30మందికి వరకు ఉన్నారు. వాస్తవానికి వీరికి కనీస వేతనాలు చెల్లించాలని 2016లో ఉమ్మడి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వెలువడిన ప్రభుత్వ అధికారిక నిబంధనలు ఇప్పటికీ అమలు కాలేదు. ఫలితంగా జిల్లాలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌ల పరిస్థితి దయనీయంగా ఉంది. అడ్డా మీద కూలీల కంటే కూడా తమ వేతనాలు చాలా తక్కువగా ఉన్నాని వారంతా వాపోతున్నారు. అయితే, ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేసే ఎన్ఎంఆర్‌లకు వేతనాలు గెజిట్ ప్రకారమే ఇస్తుండటం గమనార్హం.

**15శాతం పెంచుతూ జీవో**



రోడ్లను శుభ్రం చేస్తున్న కార్మికులు

తాత్కాలిక పద్ధతిన వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులుగా వీరిని రిక్రూట్ చేసుకున్నారు. వాస్తవానికి వివిధ శాఖలు వారికి అవసరమైన మేరకు రోజువారీ పద్ధతిన పనిచేసే ఎన్ఎంఆర్‌ల వేతనాలు చెల్లించాలి. ఈ అందరికీ చివరిసారిగా 2018లో వేతనాలు పెరిగాయి. అనంతరం కరోనా కారణంగా ఈ పెంపుదల జరగలేదు. తాజాగా వీరి వేతనాలను 15శాతం మేరకుపెంచుతూ కలెక్టర్ కర్ణన్ గెజిట్ జారీ చేశారు. చేసే పని, ప్రావీణ్యం ఆధారంగా వీరిని అన్‌స్కిల్డ్ (చౌకీదార్, అటెండర్, స్వీపర్, మేస్త్రీ, మజ్దూర్, స్కావెంజర్ తదితరాలు) సెమీ స్కిల్డ్ (సెకండ్ క్లాస్ మేషన్, కార్పెంటర్, బ్లాక్‌స్మిత్, పెయింటర్, ఫిట్టర్, కుక్, ఎలక్ట్రీషియన్, తదితరాలు) స్కిల్డ్ (ఫస్ట్‌క్లాస్ మేషన్, మెకానిక్,ఫిట్టర్, వెల్డర్, డ్రైవర్, క్లర్క్స్, టైపిస్ట్ తదితరాలు) అనే మూడురకాలుగా వర్గీకరించారు. ఇవే ఆదేశాలు కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు వర్తించనన్నాయని అధికారులు తెలిపారు.

### ఆ 30 మందికి అమలు చేయాలి



ప్రస్తుతం కరీంనగర్ కలెక్టరేట్‌లో దాదాపు 30 మంది 15 ఏళ్లుగా ఎన్ఎంఆర్‌లుగా పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. కాకుండా కేవలం రూ.8500 నామమాత్రపు వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ విషయం సమాచార హక్కు చట్టం ద్వారా వెల్లడైంది కూడా. వారంతా నోరు తెరిచి అడగలేని దయనీయ స్థితిలో ఉన్నారు. ఎన్ఎంఆర్‌లకు తాజాగా 15శాతం వేతన సవరణను ఆహ్వానిస్తున్నాం. కానీ, వీరి విషయంలో మానవతా దృక్పథంతో అందరికీ కొత్త వేతన సవరణ ప్రకారం జీతాలు అందజేయాలి.

– మహమ్మద్ జమీల్, సామాజిక కార్యకర్త

| కేటగిరీ | 2018 ప్రకారం | వేతనాలు |
|---|---|---|
| | నాన్ కార్పొరేషన్ | కార్పొరేషన్ |
| అన్‌స్కిల్డ్ | రూ.425 | రూ.531 |
| సెమీ స్కిల్డ్ | రూ.480 | రూ.600 |
| స్కిల్డ్ | రూ.540 | రూ.675 |
| కేటగిరీ 2022 ప్రకారం వేతనాలు | | |
| | నాన్ కార్పొరేషన్ | కార్పొరేషన్ |
| అన్‌స్కిల్డ్ | రూ.489 | రూ.611 |
| సెమీ స్కిల్డ్ | రూ.552 | రూ.690 |
| స్కిల్డ్ | రూ.621 | రూ.776 |

(నోట్: ఈ పెంపుదల 2019–2020, 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలకు వర్తిస్తుంది..)

## క్లుప్తంగా

### యూపీఎల్ రద్దుకు ఎన్టీపీసీ నిర్ణయం?

- అదే జరిగితే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల భవిష్యత్ అంధకారం

**జ్యోతినగర్(రామగుండం):** యుటిలిటీ పవర్ టెక్ లిమిటెడ్(యూపీఎల్)ను ఎన్టీపీసీ రద్దు చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. అదే జరిగితే యూపీఎల్‌లో దేశ వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న వేలాది మంది ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుంది. మహారత్న ఎన్టీపీసీ సంస్థలో 27 ఏళ్ల లాభాలు, వాణిజ్య కార్యకలాపాలతో యూపీఎల్ ఉద్యోగులు అంచనాలను అందుకున్నారు. ఒకవేళ యూపీఎల్ రద్దయితే వారు మరోచోట ఉద్యోగాలను పొందేందుకు వయోపరిమితి అర్హత కోల్పోతారు. యాజమాన్యం తన నిర్ణయంపై ఆత్మపరిశీలన చేసుకోవాలని, ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని, యూపీఎల్ రక్షణ కల్పించాలని వారు వేడుకుంటున్నారు.

### గౌడ సంఘం యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడి నియామకం

**పాలకుర్తి(రామగుండం):** సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కీసరి రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కు వీరాస్వామిగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానని, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి



**పెద్దపల్లిరూరల్:** పోషక విలువలున్న ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో కవిత అన్నారు. పెద్దపల్లి మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాలకు ఆమె హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, ఆకుకూరలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. పెద్దపల్లి పట్టణంతోపాటు మండలంలోని అప్పన్నపేట, నిట్టూరు, పెద్దకల్వల, రాఘవాపూర్ తదితర గ్రామాల్లో పోషణ్ పక్వాడ్ పక్షోత్సవ కార్యక్రమాల్లో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

### ఆర్జీ–1 జీఎంను సన్మానించిన డైరెక్టర్లు



**గోదావరిఖని(రామగుండం):** సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 జీఎంగా పనిచేస్తూ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న కె.నారాయణను సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బలరాం, సత్యనారాయణరావు, ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు..!

- జిల్లాలో 47 కేంద్రాలు
- ప్రభుత్వ కేంద్రాలు 32
- ప్రైవేట్ కేంద్రాలు 15
- పదో తరగతి మొత్తం విద్యార్థులు 7,937 మంది



**సుల్తానాబాద్:** పదో తరగతి పరీక్షలు వచ్చేనెల 3 నుంచి ప్రారంభంకానున్నాయి. గతంలో మాదిరిగాకాకుండా ఈసారి ఆరు పేపర్లకే పరీక్షలు ఉంటాయి. అయినప్పటికీ నిఘానేత్రాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. మాస్ కాపీయింగ్, చూచిరాతకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చింది. జిల్లావ్యాప్తంగా 47 కేంద్రాలను గుర్తించారు. ఇందులో ప్రభుత్వ 32, ప్రైవేట్ పాఠశాలల్లో 15కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 7,937 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థుల్లో పరీక్షలపై భయం పోయేలా కలెక్టర్ సంగీత ఆదేశాల మేరకు సబ్జెక్టు ఉపాధ్యాయులను అప్రమత్తం చేశారు. మరోవైపు హెచ్‌ఎంలు, ఎంఈఓలతో డీఈవో మాధవి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పరీక్ష కేంద్రాలకు దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడపనుంది. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించనున్నారు. ప్రతి కేంద్రంలో ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్త అందుబాటులో ఉంటారు. గ్లూకోస్ పౌడర్‌తోపాటు ఫస్ట్ ఎయిడ్‌కు సంబంధించిన సామగ్రి అందుబాటులో ఉంచనున్నారు. వేసవి నేపథ్యంతో మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి చల్లటి తాగునీటిని సమకూర్చనున్నారు. పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు జరుగుతాయి. విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి గంట ముందే అనుమతిస్తాం. స్పెషల్ లాంగ్వేజీ, బయాలజికల్, ఫిజికల్ సైన్స్ పేపర్లకు అదనంగా 20 నిమిషాల సమయం ఇస్తారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలవుతుంది.

### భయం వీడితే విజయమే..



విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలి. ప్రశాంతంగా రాస్తే విజయం సొంతమవుతుంది. ఇప్పటికే సిలబస్ పూర్తిచేశాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ.. అల్పాహారం కూడా అందిస్తున్నాం. పరీక్షలు ఎలా రాయాలో ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. – మాధవి, డీఈవో

## బొగ్గుబాయి వార్తలు

# ముందస్తు పరీక్షలతోనే వ్యాధుల నిర్ధారణ

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్



గుండె వ్యాధి నిర్ధారణ పరీక్షలను పరిశీలిస్తున్న జీఎం మనోహర్

**గోదావరిఖని(రామగుండం):** ముందస్తు పరీక్షలతోనే వ్యాధుల నిర్ధారణ జరుగుతుందని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. సోమవారం ఓసీపీ–3లో ఉద్యోగులకు గుండెవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో ఆకస్మిక గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఎలాంటి లక్షణాలు లేకుండా గుండెపోటు వస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, వైద్య శిబిరం ఏర్పాటు చేసిందన్నారు. గనుల వద్దే వైద్య పరీక్షలు నిర్వహించడం వల్ల ఏదైనా ఇబ్బంది ఉన్నట్లయితే త్వరగా వైద్యులను సంప్రదించే అవకాశం ఉంటుందని తెలిపారు. అశ్రద్ధ వహిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. మంచి ఆహారపు అలవాట్లతో నిత్యం వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన ఉద్యోగి సంస్థకు కీలకమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌రెడ్డి, ఇంజినీర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**రామగిరి(మంథని):** సింగరేణిలో పని చేస్తున్న నర్సరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఫారెస్ట్రీ డీజీఎం బానోతు కర్ణాకు వినతిపత్రం అందించి, మాట్లాడారు. నర్సరీ కార్మికులకు కనీస వేతనం, బోనస్, పీఎఫ్, వైద్యం, చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని కోరారు. కొన్నేళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తింపు లేకుండా అడ్డా మీద లేబర్లుగా పని చేస్తున్నారని అన్నారు. వారి న్యాయమైన హక్కుల సాధన కోసం ఐఎఫ్‌టీయూ పోరాట ఫలితంగా సింగరేణి యాజమాన్యం ముందుకు వచ్చి, సమస్యల పరిష్కారానికి హామీలు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా కొత్తగా పిలిచిన టెండర్‌లో కార్మికులకు చెందాల్సిన హక్కులు, సౌకర్యాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

# ప్రజాసంక్షేమమే బీఆర్‌ఎస్ పార్టీకి రక్ష

- మూడోసారీ వచ్చేది మన ప్రభుత్వమే
- ఎలిగేడు ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**ఎలిగేడు(పెద్దపల్లి):** సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజాసంక్షేమమే శ్రీరామరక్ష అని, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మూడోసారీ వచ్చేది మన ప్రభుత్వమేనని తెలిపారు. సోమవారం ఎలిగేడు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక కరెంట్ కష్టాలు పోయి, రైతులకు, ఇళ్లకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు రైతుబంధు, రైతుభీమా వంటి పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.200 పెన్షన్ ఇస్తే మన ప్రభుత్వం రూ.2,016, షాదీముబారక్, కల్యాణలక్ష్మీ పథకాల కింద పేదింటి ఆడపిల్లల వివాహానికి రూ.1,01,116 అందిస్తోందన్నారు. స్వచ్ఛ గ్రామాలుగా 27 పంచాయతీలు అవార్డులు అందుకున్నాయని తెలిపారు. ఎన్నికల సమయం కాబట్టి కాంగ్రెస్, బీజేపీ నాయకులు గ్రామాలకు వస్తున్నారని, వారి హయాంలో ఏం చేశారో నిలదీయాలని సూచించారు. నియోజకవర్గంలో కురిసిన వడగండ్ల వానల వల్ల పంటలకు నష్టం వాటిల్లిన విషయాన్ని సీఎం కేసీఆర్‌కు తెలిపి, రైతులను ఆదుకోవాలని కోరానన్నారు. ఆయన ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ.ఖలీల్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నరినేని సుధాకర్‌రావు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ కొక్కిరాల మహేశ్వర్‌రావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మాడ కొండాల్‌రెడ్డి, సర్పంచ్ సింధూజ, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### ‘ఎల్లంపల్లి’ నిర్వాసితులకు పరిహారం ఇవ్వండి



మంత్రి హరీశ్‌రావుతో ఎమ్మెల్యే చందర్, సర్పంచ్‌లు

**రామగుండం:** ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని ముంపు గ్రామాల సర్పంచులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ద్వారా హైదరాబాద్‌లో ఆయనను కలిశారు. నిర్వాసితుల సమస్యలపై మొరపెట్టుకున్నారు. పునరావాస ప్యాకేజీ చెల్లింపులో ఏళ్లుగా జాప్యం జరుగుతోందని, ఫలితంగా బాధితులు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన మంత్రి త్వరలోనే ఎల్లంపల్లి నిర్వాసితులకు పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పొట్యాల, వేంనూర్ నిర్వాసిత గ్రామాల సర్పంచులు ఎదులాపురం నీరజ, వేంనూరు సర్పంచ్ కోల లత, నాయకులు వెంకటేశ్, చంద్రమౌళి, ప్రదీప్, స్వామి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### రూ.2.5 లక్షల ఎల్‌వోసీ అందజేత

**ధర్మారం(ధర్మపురి):** మండలంలోని కమ్మరిఖాన్‌పేటకు చెందిన శంకరయ్యకు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం రూ.2.50 లక్షల ఎల్వోసీ మంజూరు చేసింది. సంబంధిత కాపీని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం బాధిత కుటుంబసభ్యులకు అందించారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

### 7న చలో ఢిల్లీని విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**గోదావరిఖని(రామగుండం):** వచ్చే నెల 7న నిర్వహించే చలో ఢిల్లీని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. బీజేపీ అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత పోస్టర్‌ను సోమవారం గోదావరిఖనిలో ఆవిష్కరించారు. నాయకులు ఎరవెల్లి ముత్యంరావు, భిక్షపతి, మెండె శ్రీనివాస్ అరవింద్, రవి, భూమయ్య, ఓదెలు, పీర్‌మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# బీఎంఎస్ పోరాటం వల్లే సీఎంపీఎఫ్ ఆన్‌లైన్



మాట్లాడుతున్న సత్తయ్య

**గోదావరిఖని(రామగుండం):** బీఎంఎస్ పోరాటం వల్లే సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ కానుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. సోమవారం ఓసీపీ–3 బేస్ వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ అయితే కార్మికులు ఆన్‌లైన్‌లోనే తమ భవిష్యనిధి నిల్వలు చూసుకునే వీలుంటుందన్నారు. దేశవ్యాప్తంగా సీఎంపీఎఫ్ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించామని పేర్కొన్నారు. స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుందన్నారు. అన్ని సీఎంపీఎఫ్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ డీటీపీ ఎంట్రీ మేలో ప్రారంభమై జూన్‌లో పూర్తవుతుందని తెలిపారు. రాబోయే గుర్తింపు ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు కుమారస్వామి, పొన్నమనేని వేణుగోపాల్‌రావు, మాదాసు రవీందర్, నూతి శ్రీమన్నారాయణ, ప్రమోద్‌కాషల్, ముదాం సత్తయ్య, బానోతు రంజిత్‌కుమార్, ఉప్పులేటి శంకర్, సాంబయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుక్షణం రక్షణతో విధులు నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న జీఎం గురువయ్య

**గోదావరిఖని(రామగుండం):** అనుక్షణం రక్షణతో విధులు నిర్వహిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య అన్నారు. సోమవారం ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1లో ఆయన పర్యటించారు. ఆఫ్‌లోడింగ్ క్వారీలోని పని స్థలాలను, ప్రాజెక్టు విస్తరణ పనులను, తీసుకుంటున్న రక్షణ చర్యలను పరిశీలించారు. ఓసీపీల్లో ఎండాకాలం సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్.సాంబయ్య, ఏరియా జీఎం టీవీరావు, ప్రాజెక్టు అధికారి ఎస్.రాధాకృష్ణ, ఏరియా రక్షణ అధికారి సీహెచ్.వెంకటరమణ, ప్రాజెక్టు ఇంజినీర్ ఆర్.శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్‌హరిజన్, రక్షణ అధికారి కోటయ్య తదితరులున్నారు.

# మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



ఉత్పత్తులను పరిశీలిస్తున్న జీఎం మనోహర్

**గోదావరిఖని(రామగుండం):** సింగరేణి మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. సోమవారం వృత్తి విద్య కోర్సుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్వహించిన టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు పూర్తవగా వారు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ఏరియాలో మూడు సెంటర్ల ద్వారా టైలరింగ్‌లో 108 మందికి, మగ్గం వర్క్‌లో 35 మందికి, బ్యూటీషియన్‌లో 72 మంది, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులో 56 మంది మహిళలకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకొని, రాబోయే రోజుల్లో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు సింగరేణి తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు సవిత, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, అధికారులు అనిల్‌కుమార్, శ్రీనివాస్, సేవా కో–ఆర్డినేటర్ దేవారెడ్డి, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాలు



అధ్యక్షుడు బాలకిషన్ ప్రసాద్‌తో కమిటీ సభ్యులు

**సుల్తానాబాద్(పెద్దపల్లి):** సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూసారపు బాలకిషన్ ప్రసాద్ ఎన్నికయ్యారు. సోమవారం అసోసియేషన్ స్థానిక కార్యాలయంలో పోలింగ్ నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా పదవికి పెగడ శ్యాంసుందర్, జోగుల రమేశ్‌లు పోటీ పడగా ఇరువురికీ 20 చొప్పున ఓట్లు వచ్చాయి. మొదటి 6 నెలలు శ్యాంసుందర్, తర్వాత 6 నెలలు రమేశ్ పదవిలో ఉండాలని తీర్మానించారు. ఉపాధ్యక్షుడిగా దూడం ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా అవుల శివకృష్ణ, కోశాధికారిగా సామల రాజేంద్రప్రసాద్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా చీకటి సంతోష్‌కుమార్, లైబ్రరీ కార్యదర్శిగా దొడ్డిపల్లి సూర్యనారాయణ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జి.దివాకర్‌రావు, అవుల లక్ష్మీరాజం, పబ్బతి లక్ష్మీకాంత్ రెడ్డి, ఆలూరు శ్రీనివాసరావు, అకారపు సర్వోత్తమ్ రెడ్డి, మాదూరి ఆంజనేయులు ఎన్నికయ్యారు.

**మంథని:** బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కేవీఎల్ ఎస్.హరిబాబు, ఉపాధ్యక్షుడిగా కేతిరెడ్డి రఘోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ముస్కుల సహేందర్ రెడ్డి, కార్యదర్శిగా దండెపల్లి విజయ్‌కుమార్, లైబ్రరీ సెక్రటరీగా గులుకోట శ్రీకాంత్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా కటకం శ్రీనివాస్, కోశాధికారిగా బొట్ల ఆంజనేయులు ఎన్నికయ్యారు.

# బీజేపీవి కక్షపూరిత చర్యలు



సుల్తానాబాద్‌లో రిలే దీక్షలో విజయరమణారావు, నాయకులు

**సుల్తానాబాద్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతోందని మాజీ ఎమ్మెల్యే, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షులు చిలుక సతీశ్ కుమార్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ఉంటే తమ ప్రభుత్వానికి ముప్పని భావించి బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. నాయకులు అంతటి అన్నయ్య గౌడ్, దన్నాయక్ దామోదర్ రావు, చిలుక సతీశ్, ఎండీ.రఫిక్, చింతల రాజు, దున్నపోతుల రాజయ్య, మేకల పోచాలు, అమిరిశెట్టి రాయలింగు, తిరుపతి,ద న్నాయక్ శ్రీనివాస్ రావు, కుమార్ కిషోర్, ఎండీ.మొబిన్, ఎండీ.ఫహీం, శంకర్, గడ్డం అనిల్ పాల్గొన్నారు.

**దళితులను దగా చేస్తున్న సీఎం**

**పెద్దపల్లిరూరల్:** దళితులను సీఎం దగా చేస్తున్నారని విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం గొల్లపల్లి (తుర్కలమద్దికుంట), కుర్మపల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాస్, స్వామి, సంతోష్, అనిల్, తిరుపతి, గుమ్మడి విజయ్, బండ శ్రీను, బొక్కల సంతోష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

### కుక్క దాడిలో బాలుడికి గాయాలు

**కోల్‌సిటీ(రామగుండం):** గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన అభిరాం అనే బాలుడు సోమవారం నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క దాడి చేసి, కరిచింది. స్థానికులు రాళ్లతో కొట్టడంతో అక్కడి నుంచి పారిపోయింది. ఈ ఘటనలో బాధితుడి కాలికి గాయాలవడంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుక్కలు నిత్యం దాడులు చేస్తున్నా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు.

# జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యున్ని కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

**గోదావరిఖని(రామగుండం):** జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు సుభాష్ ఎర్తిని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో కలిశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. కారుణ్య నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ డిపెండెంట్లకు సంబంధించి వయోపరిమితిని ఐదేళ్లకు పెంచాలన్నారు. సింగరేణి అన్ని శాఖల్లో ఎస్సీ, ఎస్టీలకు తగిన ప్రాధాన్యం ఉండాలని, ఉద్యోగ నియామకాల్లో మెరిట్‌లో ఉన్న అభ్యర్థులను మెరిట్‌లోనే పరిగణించాలని, రిజర్వేషన్ కోటా ఖాళీల్లో భర్తీ చేయవద్దని కోరారు. వచ్చే అంబేద్కర్ జయంతికి ప్రతి ఏరియాకు రూ.లక్ష కేటాయించాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు పులి మోహన్, యాట ఓదెలు, గంగారపు లింగమూర్తి, ఆరెపల్లి రామచందర్, గోడి రమేశ్, దామెర ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హోమంలో వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు



నిరంతర సహపంక్తి భోజనాలు

# వైభవంగా శివాలయం పునర్నిర్మాణం

సుల్తానాబాద్‌లోని గుడిమిట్టపల్లిలోగల శివాలయం పునర్నిర్మాణ ప్రక్రియ ముగిసింది. ఆదివారం నుంచి సోమవారం వరకు 24గంటల పాటు శివుడికి క్షీరాభిషేకం చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో హోమం చేశారు. నిరంతర సహపంక్తి భోజనాలు కొనసాగాయి. ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, నల్ల ఫౌండేషన్ చైర్మన్ నల్ల మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, ఎంపీపీ బాలాజీ రావు, ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షులు నగునూరి అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఐల రమేశ్, కోశాధికారి అయిత రమేశ్ తదితరులు దర్శించుకున్నారు. – సుల్తానాబాద్


సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

విల్లా ప్లాట్లు, హౌజెస్ బుకింగ్ ప్రారంభం

■ GWMC అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు (హన్మకొండ) లో విల్లా ప్లాట్లు 4 BHK డూప్లెక్స్ హౌజెస్ 3 BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్ట్‌లో బుకింగ్ ప్రారంభమైనవి. సంప్ర: సోమేశ్వర్ - 8317584874 [W-785501]

**SERVICES**

■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత, టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 8699691739. [T-1792]

బంగారు ఆభరణాల వేలం పాట రద్దు

■ తేది: 19-03-2023 రోజున సాక్షి దినపత్రికలో సిటి యూనియన్ బ్యాంక్ బంగారు ఆభరణముల వేలం పాట తేది: 29-03-2023 రోజున ఉన్నదని ప్రకటించాము. కానీ అట్టి వేలం పాటని రద్దు చేయడం జరిగింది. తదుపరి వేలం పాట తేదీని త్వరలో తెలియజేస్తాము. ఇట్లు బ్రాంచ్ మేనేజర్, సిటి యూనియన్ బ్యాంక్, కరీంనగర్ బ్రాంచ్. [K-1219977]

**WANTED**

■ హరేకృష్ణ హోంకేర్, నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం:16k - 18k విజయవాడ.ఫోన్ : 9640528899, 9640648899 [H-793405]

www.sakshi.com

■ తెలుగులో మాట్లాడగలిగే మార్కెటింగ్ & రికవరీ సూపర్‌వైజర్ నాగ్‌పూర్ (మహారాష్ట్ర)లో కావలెను. వసతి సౌకర్యం కలదు. ఇ-మెయిల్: aggroupngp@gmail.com, మొబైల్: +91 8956718514, +91 9096544567 [HA-593]

**FACULTY TEACHERS**

■ శ్రీ చైతన్య, నారాయణ అకాడమీస్‌లో టీచింగ్ నాన్ టీచింగ్ వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ అ.కా.ను జీ: 21K to 31K ఇంట్రెస్ట్ ఉన్న వారు డీటెయిల్స్ వాట్సాప్ చేయగలరు. 6281159171 [HA-28696]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact: 9951602933, 9951602824